పల్లెటూళ్ల కాలక్షేపం

# గంగరావి చెట్టుకింద

యం. కాళిదాసు

గంగరావి చెట్టు పేరు వినగానే ముందు మనకి పల్లెటూళ్లు జ్ఞాపకొస్తయ్. ఇళ్ళముందు గంగరావి చెట్టు, దానికింద గొడ్లు గోదం; గ్రామ చావడి దగ్గర గంగరావి చెట్టు, దానికింద సమస్తమయిన అంటే అర్థమయిన రాజకీయాలూ చర్చించే పిన్నలూ, పెద్దలూనూ; చేనుకాడి గట్టుమీద గంగరావి చెట్టు, దాని కింద పొలంపోయిన రైతులు పాలేర్లు విశ్రాంతి తీసికోవటం; యిత్యాది రూపాలతో గంగరావి చెట్టుకింద గుమిగూడే పల్లెటూరి ప్రజలలో అన్ని తరహాల వారుంటూరు. వారు చర్చించని రాజకీయాలు, సమస్యలూ ఉండవు. వీరిలో ప్రతివొకడూ యెదటివాడిని తృణీకరించి తన మాటనే వేదాక్షరంగా నమ్మాలని మహాబాధ పడతాడు. గింజుకు లాడతాడు. ఎదుటివాణ్ణి తుస్కారించి, న్యూనతపరచి చంకలు గుద్దుకోవాలని చూస్తుంటాడు. ఇటువంటి వారిమధ్య చెలరేగే వివాదం అర్థరహితం. కాని వినటానికి మహాసొంపుగా వుంటుంది.

* * *

ఆయాల మద్దినేల కాడినుంచీ సన్నసన్నగా తుంపర పడతా నేవుంది. ఒలిగాలి కొడ్తూ జివ్వు మనిపిస్తున్నది. పైమీది ఉత్తరీయాలు నడుం చుట్టూ మోకాళ్ళచుట్టూ పోనిచ్చి బిగించి వెనక్కివంగి కూచుని బారెడు మూరెడు చుట్టలు తగలేస్తూ సగం నిద్రలో జోగుతూ రామయ్యా, రంగయ్యా, వెంకయ్యా, మంగయ్యా యింకా పది మంది సావిడి దగ్గిర గంగరాయి చెట్టుకింద కూకుండారు. రామయ్యా ఆ మూల దూడ పలుపు పేనుతుండాడు. మాదిగ రాముడు ఆమూల రంగయ్యాతో "బండికి తారెయ్యటానికి అనువం లేదు దొరా" అంటుండాడు. మాణిక్యరావు ఆ పక్కని తన పిత్‌పారం తెలివంతా వొలకబోత్తుండాడు. అందరి మాటా యిటూ ఆటూ సాగి చివరికి గునుపురం తాసీల్దారు గారి జీతంమీదికి పోయింది.

"గునుపురం తాసీల్దారు గారికి నాలుగొందలు జీతమంటరా" అన్నాడు రామయ్యా.

"ఏడిశావ్! నాలుగొందలో లెక్కంటరా? సిరిపురం తాసీల్దారు గారికి ఐదొందలు జీతమంట" అన్నాడు వెంకయ్యా.

"ఓరి యెర్రివెంకమ! ఐదొందలు తీసుకోంగా నువ్ చూశావంట్రా?" అన్నాడు రామయ్యా తనమాట కాదన్నాడనే ఉక్రోషంతో.

"నాలుగొందలు తీసుకోంగా నువ్వు చూశావా?"

"చూడాలేం? ఆయనాపీసులో మనిసొకరు చెప్పారు."

"సిరిపురం తాసీల్దారు మా బావ బావకి బావ. మా బావ నాకీ సంగతి చెప్పాడు. ఆయనకి ఐదొందలు జీతమని."

"ఓరి నోర్ముయ్యరా? మీ బావకీ నీకూ తెల్చి గోంగూరపచ్చడి."

"ఆరేయ్! ఎంకునుగా అతిగా వాగుతావ్? అసలు నీకేం తెల్సు చెప్పు?"

"ఓరి నాపా! నాకంటె నీకెక్కువ తెల్సుంటరా?"

"ఆ తెల్సిందేదో బయట పెట్టరా యెదవా!"

"ఎదవ గిదవన్నావంటే నడుమిరుగిద్దిరోయ్."

"ఏం! యిందాకటేనుంచి నన్నంటల్లా? నా నడుమిరిగి నీ నడుముండద్దేం?"

"ఏదీ కొట్టు సూద్దాం."

"నువ్ కొట్టు ముందు. తర్వాత చెప్తా ఆడేందో,"

ఇట్లా రెట్టించుకుని రామయ్యా వెంకయ్యా ఒకళ్ళ నొకళ్లు చాత్రప్రకారం బూతులు తిట్టుకుని పడదోసుకున్నారు. రాఘవయ్యా, బాపయ్యా గమేళ్ళి వచ్చి యిద్దర్నీ యిడదీసి

"యెందుకురా యెదవనాయాల్లారా యేళ్ళొచ్చినయ్? ముందూ యెనకా తెలవదు" అని దొబ్బులేశారు.

"అబ్బబ్బా యేం వాన! ఇయ్యేడు మన్నోట్లో మట్టే" అన్నాడు సుబ్బయ్య. "నిజమేరా" అన్నాడు లింగయ్య.

"నువ్ చెప్పవే రాఘవయ్య మావాఁ! నా వల్ల యేమన్నా తప్పుందంటేఁ?" అడిగాడు రామయ్య.

"ఆ బద్దు కదిలించాడు కాని నావల్ల సూదిమొనంత తప్పుందంటే సుబ్బయ్య బాబాయ్?" అన్నాడు వెంకయ్య.

"ఓరి అదరిపడమాకరా! రేపు తేలుద్ది కోర్టులో. ఈ దెబ్బలేందో, యీ దౌర్జన్యమేందో."

"పో చేసుకునేదేదో నేసుకో."

"ఇంతకీ యే తాసిల్దారుకి జీత మెక్కువరా" అన్నాడు రంగయ్య. అంతా కిలకిలమన్నారు.

కేసు చూడంగానే నవ్వు వచ్చింది మేజిస్ట్రీటు గారికి. "గుణుపురం తాసీల్దారుకి జీతమెంతయితే వీళ్ళకెందుకు? సిరిపురం తాసీల్దారుకి జీతమెంతయితే వీళ్ళకెందుకు? బొజ్జనిండా తిని ఏమీ తోచక, బజార్లో చేరి గోలచేసే ఇటువంటివాళ్ళకేమి శిక్ష" అని ఆలోచించి ఆ కేసును ఎనిమిదిమాట్లు వాయిదా వేశాడు. ఎనిమిది వాయిదాలకి రామయ్యకి, వెంకయ్యకి చెరి నాలుగువందలూ జలుబు వదిలింది. "గుణుపురం తాసీల్దారుడికి జీతం తక్కువయితే మన మేమన్న ఆయన కిత్తుండామా? సిరిపురం తాసీల్దారుడికి జీతం ఎక్కువయితే మన కేమన్నా యిత్తుండాడా? దేనికి వచ్చిన రభస యిది? ఏమీ తోచక గైరాజుగా తిరుగుతాంటే యిటువంటి పోసోకులు కబుర్లు బయాలుదేరుతయ్. ఎనకటికి పనిలేని మంగలి..." అని వాళ్ళల్లో వాళ్లు సమాధానపడి ఒకే బండిలో యింటికి వచ్చారు.

# ఎన్నికలు : అతివాదుల కర్తవ్యం

రావెళ్ల హానుమంతరావు

త్రమతమ రాష్ట్రాలలో యెన్నికలు ఎలా జరుగుతాయో తెలుసుకో దలచుకున్న వారు మొట్టమొదట ప్రారంభించబడిన హిమాచల ప్రాంతంలో యెన్నికలు ఎలా జరిగాయో తెలుసుకోవటం అవసరం. ఇప్పుడు మనకు గెలుపు ప్రధానంగాదు, ఎన్నికలు ఎలా జరిగాయనే సంగతి శ్రద్ధగా గమనించాలి.

"హిమాచల ప్రాంతంలో మొత్తంమీద పోలయిన వోట్లు 100కి 17 మాత్రమే. వందల సంఖ్యలో మహిళలకు వోట్లున్న ఒక పోలింగు స్టేషను ఏరియాలో యెనిమిదిమంది మహిళలు మాత్రమే వోటు చేశారు" ఇవి హిమాచల ప్రాంతంలో తొలిసారిగా జరిగిన జనరల్ యెన్నికలనుంచి తేలిన ఫలితాలు.

నూటికి పదునేడుమంది మాత్రమే ఎందుకు వోటుచేశారు? మిగిలిన ఎనభైముగ్గురు యెందుకు గాను వోట్లు చేసే కార్యక్రమములో పాల్గొనలేదు? ఈ ప్రశ్నలకు జవాబు చెప్పవలసిన బాధ్యత కాంగ్రెసు ప్రభుత్వాలపై వుంది; అన్నప్పుడు, అక్కడ వోటర్లు అమాయకులుగావటంచేతనూ, వోటుకున్న విలువను వారు గ్రహించలేక పోవడంచేతనూ ఇలా జరిగిందని కాంగ్రెసు సర్వాధికారులు పత్రికలలో ప్రకటనలు చేయవచ్చును. రేడియోలో ఉపన్యాసాలు దంచవచ్చును. అయినా దీన్ని నమ్మేటంతటి అమాయకులు ఇండియాలో లేరు.

మూడుమాసాల క్రితం ఢిల్లీలో మ్యునిసిపాల్టీ యెన్నికలు జరిగినప్పుడుగూడా ఇలాంటి ప్రకటనలే వచ్చాయి. అప్పుడు ఆ యెన్నికల్లోనూ 100కి 60 మంది ఓటర్లు మాత్రమే పాల్గొన్నారు. ప్రభుత్వం దీనిపై వ్యాఖ్యానం చేసినప్పుడు గూడా ఇప్పుడు చెబుతూన్నట్లే చెప్పింది. కాని నిజం నిదానంమీద తేలింది.

ఢిల్లీ మ్యునిసిపాలిటీ యెన్నికలను గురించి